

ఆకాంక్షా పరులైన
స్త్రీ పురుషులకు ప్రేమ అంటే
ఏమిటో తెలియదు.
మన మీద అధికారం చెలాయించి
పెత్తనం చేసేది
ఈ ఆకాంక్షా పరులే.


# అంతరంగయాత్ర

జె. కృష్ణమూర్తి బోధనలతో కూర్చిన ప్రచురణ

ANTHARANGA YATRA

KRISHNAMURTI FOUNDATION INDIA AUG. 2010 - NOV. 2010 Rs.2/- VOL.V ISSUE 1


# సంఘర్షణ

## (క్రమత, శాంతి, సామరస్యము, సౌందర్యము కావాలని అంటున్న మనసు)

ఒకరి ప్రశ్న: నా చుట్టూ ఉన్న ప్రతి ఒక్క దానితోను నాకు విపరీతమైన ఘర్షణ జరుగుతూ ఉంటుంది. పైగా నాలో ఉన్న ప్రతిదీ మరో దానితో సంఘర్షిస్తూ ఉంటుంది. అలౌకికమైన సక్రమస్థితిని-దైవిక క్రమతను గురించి అందరూ చెప్తుంటారు. ప్రకృతిలో సమశృతి, సామరస్యం కనబడుతుంది. మనిషిలో మాత్రమే ఈ సామరస్యత లోపిస్తున్నదని నాకు అనిపించింది. దీని వల్ల తనకు ఇతరులకు కూడా అనేక బాధలు జనిస్తున్నాయి. ఉదయం పూట లేచీ లేవగానే కిటికీలో నుండి చూస్తుంటే చిన్న చిన్న పిట్టలు పరస్పరం కీచులాడుకుంటూ ఉండటం చూస్తాను. అయితే కొద్ది సేపటి కల్లా అవి ఎగిరి తమ దారిన తాము చక్కా వెళ్ళిపోతాయి. కానీ నేను మాత్రం నాతో నాకు జరుగుతున్న యుద్ధాన్ని, ఇతరులతో పడుతున్న సంఘర్షణను నాతో పాటుగా అట్టే పెట్టుకొని తిరుగుతుంటాను. ఇది తప్పించుకోవడం సాధ్యమవడం లేదు. నాతో నేను ప్రశాంతంగా ఎప్పటికైనా ఉండగలుగుతానా అని అనిపిస్తున్నది. నా చుట్టూ ఉన్న సమస్తమైన వాటితోను, నాతో నేనూ పూర్తిగా సామరస్యంతో సఖ్యతతో ఉంటే బాగుంటుందని నేను ఆశిస్తున్నాను. ఈ కిటికీ లోనుండి కనబడుతున్న ఆ ప్రశాంత సముద్రజలాలలను, నీటిపై పడుతున్న కాంతి కిరణాలను చూస్తున్నప్పుడు నాకో సంగతి గాఢంగా అనిపిస్తుంది. తప్పకుండా మరో విధమైన జీవనమార్గం ఉన్నదని. తనతో తనకు, తన చుట్టూ ఉన్న లోకంతో తనకు గల ఈ అంతులేని కలహాలు అక్కడ ఉండవు అని. ఈ సామరస్యం అనేది అసలు ఎక్కడైనా ఉన్నదా? ఉన్నదంతా కేవలం అంతూపొంతూ లేని క్రమరాహిత్యమూ, అస్తవ్యస్తతా యేనా? సామరస్యమే కనుక ఉంటే అది ఏ స్థాయిలో వుండే అవకాశం వున్నది? ఆ సామరస్యం ఎక్కడో పర్వత శిఖరాగ్రాల మీద నివసిస్తుంటుందా? మంటల్లో దగ్ధమవుతున్న లోయలకు అది ఎన్నటికీ అంతుపట్టని అంశమా?

**కృష్ణమూర్తి:** ఒక దానిని వదిలేసి మరోదాని వద్దకు చేరటం సాధ్యమవుతుందా? ఏది ఉన్నదో దానిని ఏది లేదో ఆ దానిగా మార్చగలమా? సామరస్యలేమిని సామరస్యంగా, సఖ్యతగా రూపొందించడం సాధ్యమవుతుందా?

☞ 2

# ఎరుక

## మనసు ఏనాడూ స్పృశించని ఒక అపూర్వ స్థితి

*(గత సంచిక తరువాయి)*

వాస్తవం యొక్క ఇటువంటి ఈ గ్రహింపుకు ఫ్రెంచి భాషలో ఒక మాట ఉన్నది. 'కేన్ స్టటేషన్' అని. మనసు గతం నుండి తనను విడిపించుకొనగలదా అని మనం ప్రశ్నిస్తున్నప్పుడు ఆ ప్రశ్నను వేస్తున్నది 'నేను' అనే ఆ న్యాయ నిర్ణేతా తప్పొప్పుల తీర్పరా? అంటే అది గతమే కదా?

**ప్ర:** మనసు గతం నుండి విముక్తి పొందగలదా?

**కృ:** ఆ ప్రశ్నను వేస్తున్నది ఎవరు? ఎన్నో అనేకమైన సంఘర్షణల, స్మృతుల, అనుభవాల ఫలితంగా ఏర్పడిన సత్వమా ఆ ప్రశ్నను అడుగుతున్నది? లేదూ ఈ ప్రశ్న దానంతట అదే జనించిందా? వాస్తవాన్ని గ్రహించడం వలన కలిగిన ప్రశ్నా?

ఈ ప్రశ్నను వేస్తున్నది పరిశీలకుడు కనుక అయితే అప్పుడతడు తను అనే వాస్తవం నుండి తప్పించుకొని పోవాలని ప్రయత్నిస్తున్నాడనమాట. ఎందుకంటే, తను ఎంతో కాలంగా బాధలతో, కష్టాలతో, దు:ఖంతో జీవించానని, ఈ నిరంతర పోరాటం నుండి ఆవలగా పోవాలను కుంటున్నాననీ అతడు అంటున్నాడు కాబట్టి. ఆ ఉద్దేశ్యం పెట్టుకొని కనుక అతడీ ప్రశ్న వేస్తే అతడికి సమాధానం- ఏదో ఒక పలాయనమే. ఎవరైనా సరే వాస్తవాన్ని ఎదుర్కోనైనా ఎదుర్కుంటారు. తప్పించుకొని అయినా పోతారు. మాట అయినా, చిహ్నం అయినా వాస్తవం నుండి తప్పించుకొని పోవడమే. నిజంగా చూస్తే అసలు ఈ ప్రశ్న అడగడం కూడా ఒక పలాయన చర్యే. అవునా కాదా? అదే కనుక అయితే ఇది వట్టి మాటల గోల. పరిశీలకుడు కనుక లేకపోతే, అప్పుడు ఉండేది నిశ్శబ్దం. అంటే గతం సమస్తమూ పూర్తిగా లేకుండా పోతుంది.

**ప్ర:** నాకు అంతుపట్టడం లేదు. కొద్ది సెకండ్లలో మొత్తం గతమంతటినీ నేను ఎలా తుడిచి పెట్టి వేయగలను?

☞ 3

(*1వ పేజీ తరువాయి*) . . .

# సంఘర్షణ

**ప్రశ్నిస్తున్నవారు:** అయితే అప్పుడు సంఘర్షణ తప్పనిసరా? బహుశ అదే ప్రకృతి సహజమైన స్థితి, తీరు అంటారా?

**కృ:** ఇది కనుక మనం ఆమోదించామను కోండి, అప్పుడు సమాజంలో ఉన్న తక్కిన అన్నింటినీ ఆమోదించవలసి వస్తుంది. యుద్ధాలు, ఆకాంక్షా పూరితమైన పోటీ తత్వము, దౌర్జన్యంతో కూడుకున్న జీవన విధానము, మనుష్యులు ప్రదర్శించే పాశవికత, హింస; పవిత్ర క్షేత్రాలు అని మనం అంటున్న చోట్లలోను, బయటా కూడా ఇదంతా ఉన్నది. ఇదంతా ప్రకృతి సహజమైనది అని అంటారా? దీని వల్ల సమైక్యత సిద్ధిస్తుందా? ఒక రెండు అంశాలను మనం గట్టిగా పరిశీలించి చూడటం మంచిదని నాకు అనిపిస్తున్నది. ఒకటి-ఎన్నో సంక్లిష్టతలకు పోరాటాలకు నిలయమైన ఈ సంఘర్షణ అనే అంశం. రెండవది-క్రమత కావాలని, సామరస్యము, శాంతి, సౌందర్యము, ప్రేమ కావాలనీ అంటున్న మనసు అనే అంశం.

**ప్రశ్నిస్తున్నవారు:** సఖ్యత, సామరస్యం అంటే ఏమిటో నాకు బొత్తిగా తెలియదు. అది ఎక్కడో గగనంలో వున్నట్లనిపిస్తుంది. ఋతువుల్లో, ఈ మహావిశ్వపు గణిత బద్ధమైన క్రమశీలతలో అది కనబడుతుంది. అయితే దీని వల్ల నా హృదయంలో, నా మనసులో క్రమత నెలకొనడం లేదు. గణిత బద్ధమైన ఆ పరిపూర్ణ క్రమత నా క్రమత అవడం లేదు. నాలో క్రమత లేదు. నేను అస్తవ్యస్తతలో పడి వున్నాను. పరమోత్తమ మైనది అనబడే రాజకీయ పరమైన ఆదర్శ ప్రపంచాల దిశగా, ధర్మబద్ధమైన స్వర్గలోకాన్ని ప్రతిష్ఠించే దిశగా క్రమశీలతతో పరిణామం జరుగుతుందని ఘోషించే రకరకాల సిద్ధాంతాలున్నాయని నాకు తెలుసు. అయితే ఇవన్నీ నేనెక్కడున్నానో అక్కడే నన్ను వదిలేస్తున్నాయి. ఇంకో పదివేల సంవత్సరాలకి ఈ ప్రపంచం పరమోత్తమంగా, ఆదర్శలోకంగా బహుశ తయారవవచ్చు. కానీ ఆలోగా మాత్రం నేను నరకం అనుభవిస్తున్నాను.

**కృ:** మన లోను మన సమాజం లోను ఉన్న అస్తవ్యస్తతను మనం చూస్తున్నాం. రెండూ కూడా చాలా జటిలంగా ఉంటాయి. నిజానికి వీటికి పరిష్కారాలు ఏవీ లేవు. దీన్నంతటినీ చాలా జాగ్రత్తగా, పరీక్షించి చూసి, ఒక్కొక్కటీ విశ్లేషించి, అస్తవ్యస్తతకు గల కారణాలను తనలోను, సమాజంలోను వెదికి, వాటిని వెలుగులోకి తెచ్చి చూసినప్పుడు బహుశ మనసుకు వాటి నుండి విముక్తి కలిగించవచ్చని కొందరు నమ్మితే నమ్ముతారు గాక. చాలా మంది ఈ విశ్లేషణాత్మకమైన ప్రక్రియనే చేస్తున్నారు. కొందరు తెలివిగా చేస్తుండవచ్చు. కొందరు మూర్ఖంగా చేస్తుండచ్చు. అయితే ఇవేవీ మనకు దారి చూపలేవు. వేల సంవత్సరాలుగా మనిషి తనను తాను విశ్లేషించి చూసుకుంటున్నాడు. దీని వలన ఒరిగిందే మీ లేదు. సాహిత్య సృష్టి తప్ప! ఎందరో మహాత్ములు ఊహా ప్రతిపాదనల్లో, సిద్ధాంత కారాగారాలలో తమను తామే బంధించుకున్నారు. అక్కడే ఆగిపోయారు. వారు సంఘర్షణలోనే ఉండిపోయారు. మన సంఘర్షణలకు గల మూలకారణం ఏమిటంటే కోరికలో వున్న ఈ అంతులేని ద్వైతభావం. ఈర్ష్య, అత్యాశ, ఆకాంక్షాపరత్వం, దౌర్జన్యం, భయం మొదలైనవాటిని ఉత్పన్నం చేస్తున్న అంతులేని ఈ ద్వంద్వాల సారంగం. సరే, ఈ సమస్యను మరో విభిన్న దృష్టితో చూడటం సాధ్యం కాదా? ఈ పోరాటాన్ని, ఇందులో నుండి బయట పడాలని చేసే ప్రయాసను ఆమోదించి స్వీకరించడం మన సంప్రదాయ విధానంగా తయారైంది. అసలు ఇదంతా సంప్రదాయ దృష్టే. ఈ సంప్రదాయ విధానంలో పనిచేస్తుంటుంది మనసు. కానీ సంప్రదాయ బద్ధితమైన మనసు అస్తవ్యస్తతను ఇంకా ఎక్కువ చేస్తున్నదని మనం చూశాం. అందుచేత ఇప్పుడు సమస్య అస్తవ్యస్తతను అంతం చేయడం ఎలా అనేది కాదు. మనసు సంప్రదాయత నుండి విడిపించుకొని సమస్యవైపు దృష్టి సారించగలదా అనేది. అప్పుడు బహుశ సమస్యే లేక పోవచ్చును.

**ప్రశ్నిస్తున్నవారు:** నాకు బొత్తిగా అర్థం కావడం లేదు.

**కృ:** క్రమరాహిత్యం-అస్తవ్యస్తత అనే వాస్తవం వున్నది. దీనిని గురించి సందేహం ఏమీ లేదు కదా. అది నిజంగా వున్న సంగతి. సాంప్రదాయిక పద్ధతి ఏమిటంటే ఈ అంశాన్ని విశ్లేషించడం. దీని వెనుక వున్న మూల కారణాన్ని వెతికి కనిపెట్టాలని ప్రయత్నించడం, ఆ కారణాన్ని అధిగమించడం, లేదా అంటే దానికి వ్యతిరిక్తమైనదానిని కనిపెట్టి అది అందుకోవాలని ప్రయాస పడటం. క్రమశిక్షణలు, పదే పదే సాధన చేయడం, అదుపూ అణచి వేతలు, సంయమనం మొదలైన వాటితో కూడుకొని వున్న సంప్రదాయ విధానం ఇది. వేన వేల సంవత్సరాలుగా మనిషి ఇదే చేస్తూ వచ్చాడు. దీని వలన ఏమీ ఫలితం లేకపోయింది. ఈ పద్ధతిని పూర్తిగా పరిత్యజించి వేద్దామా? సమస్యను మొదలంటా ఒక విభిన్నమైన తీరులో పరికిద్దామా? అంటే సమస్యకు ఆవలగా పోనూ వద్దు; పరిష్కరించనూ వద్దు; తట్టుకొని నిలబడనూ వద్దు; తప్పించుకొని పారిపోనూ వద్దు. మనసు ఇది చేయగలదా?

**ప్ర:** బహుశా...

**కృ:** అంత త్వరగా సమాధానం చెప్పకండి. మిమ్మల్ని నేను అడుగుతున్న విషయం చాలా తీవ్రమైనది. ఆది నుండీ మానవుడు తన సమస్య లన్నింటితోను తలపడటానికి ఒకటే పద్ధతి అవలంబిస్తున్నాడు. ఆ సమస్యలను అధిగమించాలనిగాని, పరిష్కరించాలని గాని, తట్టుకొని నిలబడాలని గాని, వాటి నుండి తప్పించుకొని పారిపోవాలని గాని ప్రయత్నిస్తున్నాడు. అంత తేలిగ్గా కేవలం వాచ్యపరమైన ఆమోదంతో అదంతా కొట్టి పారేయగలరని అనుకోకండి. ప్రతివారి మనసు కూడా ఈ రకంగానే నిర్మించబడి తయారై ఉన్నది. ఇప్పుడు ఈ మనసు, ఇదంతా అవగాహన చేసుకున్నాక, వట్టిగా మాటల్లో కాదు, నిజంగానే అర్థంచేసుకున్నాక సంప్రదాయత నుండి తనను తాను విముక్తం చేసుకోగలదా? సంఘర్షణతో ఇలా సాంప్రదాయిక తీరులో వ్యవహరించడం ద్వారా ఆ సంఘర్షణ ఏనాటికీ పరిష్కారం అవదు. కాకపోగా సంఘర్షణ ఎక్కువవుతుంది. నేను

☞4

## ఒక్క సమస్య కూడా లేకుండా జీవితం ఉంటుందని ఎవరూ అనుకోరు

ఏ చింతా లేనట్లయితే మనం అసలు బ్రతికే ఉన్నామా అని అనిపిస్తుంది చాలా మందికి. ఏదో ఒక సమస్యతో తలపడుతూ ఉండటమే మన అస్తిత్వానికి నిదర్శనం అని భావిస్తుంటారు మనలో అనేకులు. సమస్య లేని జీవితం ఉంటుందని ఊహామాత్రంగా కూడా అనుకోలేము. సమస్యలో పడి ఎంత ఎక్కువగా విచారిస్తుంటే అంత ఎక్కువ అప్రమత్తతతో మనం ఉన్నట్లు పరిగణించుకుంటాం. మనసే సృష్టించిన సమస్యను గురించి ఎడతెగని ఆదుర్దా కారణంగా మనసు మొద్దుబారిపోతుంది. మనసు అలసట చెందినట్లయి దేనికీ స్పందించ లేనిదిగా అయిపోతుంది. ఎందుకని ఎప్పుడూ ఏదో ఒక సమస్య వ్యాపకంలో పడి మునిగిపోయి వుంటాం? చింతించడం వలన, దిగులు పడటం వలన ఆ సమస్య పరిష్కారం అవుతుందా? లేదా మనసు ప్రశాంతంగా ఉంటేనే సమస్యకు సమాధానం లభిస్తుందా? కాని చాలా మందికి ప్రశాంతమైన మనసు అనగానే ఒక రకమైన భయం వారిలో చోటు చేసుకుంటుంది. ప్రశాంతంగా, నెమ్మదిగా వుండాలంటే భయపడతారు. అలా వున్నప్పుడు తమలో వున్నవి ఏవేవి బయట పడతాయో అని బెంబేలు పడతారు. ఇది జరక్కుండా వుండాలంటే విచారిస్తూ, దిగులు పడుతూ వుండటమే నివారణ మార్గం అనుకుంటారు.

(*కమెంటరీస్ ఆన్ లివింగ్-1; 3వ అధ్యాయం*)

*(1వ పేజీ తరువాయి) . . .*

## ఎరుక

**కృ:** మనం ఎరుకను గురించి చర్చిస్తున్నామనే సంగతి దయచేసి దృష్టిలో ఉంచుకోవాలి. మనం ఇద్దరం కలసి ఈ ఎరుక అనే ప్రశ్నను గురించి మాట్లాడుకుంటున్నాం.

ఆ చెట్టు ఉన్నది. చెట్టు ఎడల నిబద్ధిత ప్రతిస్పందన ఉన్నది. ఇదే సంబంధ బాంధవ్యంలో 'నేను'. ఈ 'నేను–నా' యే సంఘర్షణకు కేంద్రస్థానం. సరే, ప్రశ్నను వేస్తున్నది ఈ 'నేను' యేనా? ఈ 'నేను' అనేది గతం స్వరూపమే అని మనం చెప్పుకున్నాం గదా. ఈ ప్రశ్న ఆ గత స్వరూపంలో నుండి రానట్లయితే, ఈ ప్రశ్నను 'నేను' కనుక వేయకపోతే అప్పుడు గతం నిర్మించినది ఏదీ లేదనమాట. గతపు స్వరూపం కనుక ఈ ప్రశ్నను వేస్తున్నట్లుయితే తను అనే అంశంపైన తానే పనిచేస్తున్నదనమాట. తను అంటే తనే భయపడుతున్నది. తన నుంచి తను తప్పించుకొని పోవడానికి ఈ చర్యను చేస్తున్నది. ఆ ప్రశ్న ఈ గత స్వరూపం నుండి రానప్పుడు అది తనను గురించి తనే ప్రశ్నించడం లేదు. మళ్ళీ ఒకసారి పునరావలోకనం చేద్దాం. చెట్టు ఉన్నది. చెట్టు అనే మాట ఉన్నది. చెట్టు ఎడల ప్రతిస్పందన ఉన్నది. ఆ ప్రతిస్పందనే తప్పొప్పుల నిర్ణేత – 'నేను'. ఇది గతంలో నుండి వస్తున్నది. ఇక, ఈ ప్రశ్న ఉన్నది. ఈ దారుణబాధ నుండి, ఈ సంక్షోభం నుండి నేను తప్పించుకోగలనా? 'నేను' యే ఈ ప్రశ్నను వేస్తున్నట్లయితే, అది తనను తాను ఎప్పటికీ అంతమైపోకుండా చూసుకోవాలని ప్రయత్నిస్తున్నది.

సరే, ఈ సంగతి తెలుసుకున్నది కాబట్టి ఇక ఆ ప్రశ్నను అది వేయదు. తెలుసుకున్నాక, ఇందులో నిబిడీకృతమై వున్నదంతా చూశాక ఆ ప్రశ్న వేయలేము. అసలా ప్రశ్నే రాదు. ఎందుకంటే వేస్తే ఉచ్చులో పడిపోతుంది. సరే, ఈ ఎరుక అంతా కేవలం ఉపరితలం పైనదే అని మీరు చూస్తున్నారా? చెట్టును చూస్తున్న ఎరుక వంటిదే ఇదీనూ.

**ప్ర:** మరో రకమైన ఎరుక ఏదైనా ఉన్నదా? ఎరుకకు మరోపార్శ్వం, మరో ఆయతనం ఉన్నదా?

**కృ:** ఇప్పుడు కూడా జాగ్రత్తగా అడుగులు వేద్దాం. ఏ ఉద్దేశ్యమూ వెనుక పెట్టుకొని ఈ ప్రశ్నను వేయడం లేదనే సంగతి కూడా స్పష్టం చేసుకుందాం. ఒక ఉద్దేశ్యం కనుక ఉంటే మళ్ళీ నిబద్ధిత ప్రతిస్పందన అనే ఆ ఉచ్చులో పడిపోతాం. పరిశీలకుడు పూర్తిగా నిశ్శబ్దంగా ఉన్నప్పుడు–నిశ్శబ్దంగా చేయబడటం వలన కాదు–అప్పుడు తప్పకుండా ఒక విభిన్నమైన ఎరుక, ఒక కొత్త గుణతత్వం గల ఎరుక ఉనికిలోకి వస్తుంది. అవునా?

**ప్ర:** ఏ పరిస్థితుల్లో నైనా సరే, పరిశీలకుడు లేకుండా జరిగే చర్య ఏముంటుంది? ఏం ప్రశ్నలు వస్తాయి?

**కృ:** మరి ఈ ప్రశ్నను మీరు నదికి ఈ వైపు నుండి అడుగుతున్నారా, అవతలి గట్టుపైనుండి అడుగుతున్నారా? మీరు అవతలి గట్టుమీద కనుక ఉంటే ఈ ప్రశ్న వేయనే వేయరు. ఆ గట్టుపైన ఉంటే కనుక మీ చర్య ఆ ఒడ్డు మీది నుండే వుంటుంది. అందుచేత ఈ గట్టును గురించిన ఎరుక, దీని రూపురేఖలు, దీని గుణగణాలు, స్వభావం, ఇందులో వున్న ఉచ్చుల గురించీ మీకు తెలిసి వుంటుంది. ఈ ఉచ్చుల నుండి తప్పించుకొని పారిపోవాలని ప్రయత్నించడము అంటే మరో ఉచ్చులో పడిపోవడమే. అబ్బ! ఇదంతా విపరీతమైన విసుగు కలిగిస్తుంది కదూ. ఈ ఉచ్చుల స్వరూప స్వభావాలను ఎరుక ద్వారా మనం స్పష్టంగా చూశాం. కాబట్టి ఈ మాయ ఉచ్చులన్నీ లేకుండా లుప్తమై పోతాయి.

ఇప్పుడు మనసు ఖాళీగా ఉంటుంది. మనసులో, 'నేను' ఉండదు, ఉచ్చూ ఉండదు. ఈ మనసు గుణతత్త్వం భిన్నంగా ఉంటుంది. ఎరుక మరో విభిన్నమైన పార్శ్వానికి చెంది వుంటుంది. ఈ ఎరుకకు తాను ఎరుకగా ఉన్నానని తెలియదు.

**ప్ర:** బాబోయ్! ఇది చాలా కష్టంగా వున్నది. మీరు చెప్తున్న విషయం సత్యం అని గట్టిగా తెలుస్తున్నది. నిజమనే ధ్వనిస్తున్నది. కాని నేను ఇంకా అక్కడికి చేరలేదు. మరో రకంగా మీరు చెప్పలేరా? ఈ ఉచ్చులో నుండి నన్ను త్రోసివేయలేరా?

**కృ:** మీ ఉచ్చులో నుండి మిమ్మల్ని ఎవరూ బయటకు లాగలేరు. గురువుగాని, మాదక ద్రవ్యాలు గాని, మంత్రాలు గాని, మరెవరు గానీ, చివరకు నేను గానీ, ఎవరైనా సరే, ముఖ్యంగా నేను అయినా సరే మిమ్మల్ని బయటకు లాగలేము. మీరు చేయవలసినది ఏమిటంటే మొదటినుండీ చివర వరకు ఎరుకగా ఉండటం. మధ్యలో పరధ్యాసలో పడగూడదు. ఎరుకలోని ఈ కొత్త గుణవేు సావధానశీలత. ఈ సావధానతలో 'నేను–నా' నిర్మించే సరిహద్దులు ఉండవు. ఈ సావధానత అత్యంత ఉన్నతమైన సౌశీల్యం. అందుచేత ఇదే ప్రేమ. ఇది అపార ప్రజ్ఞ. అత్యున్నత తెలివి. మనిషి తయారు చేసుకున్న ఈ ఉచ్చుల నిర్మాణ స్వరూప స్వభావాల ఎడల మీలో స్పందనశీలత లేకపోతే కనుక సావధానత సాధ్యమవదు.

*('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి)*

## మన ఈ పృథ్వి అంటే మనకు ప్రేమ ఉన్నదా? కేవలం స్వలాభానికి ఉపయోగించుకుంటున్నామా?

ఈ భూమినీ ఈ భూమి ఇచ్చే ఉత్పత్తులనూ ఒకే దృష్టితో చూస్తున్నాం. ఈ నేల అంటే మనకు ప్రేమ లేదు. ఊరికే ఉపయోగించుకుంటాం. అంతే. మన వసుధ మీద కనుక నిజంగా మనకు ప్రేమ ఉంటే ఈ నేల మనకుప్రసాదిస్తున్న వస్తువులను ఎంతో పొదుపుగా వాడుకునే వాళ్ళం. సర్, అంటే ఏమిటంటే ఈ భూమితో మనకు గల బాంధవ్యాన్ని మనం అర్థంచేసుకుంటే కనుక అప్పడు ఈ నేల ఇస్తున్న వస్తువులను వాడుకోవడంలో అమిత జాగ్రత్త చూపుతాం.

ప్రకృతితో మన బాంధవ్యాన్ని అర్థంచేసుకోవడంలో కూడా మన ఇరుగుపొరుగును, భార్యను, పిల్లలను అర్థంచేసుకోవడంలో ఉన్నంత కష్టమూ ఉన్నది. కానీ మనం దీనిని గురించి ఎన్నడూ ఆలోచించనే లేదు. ఏనాడూ నక్షత్రాలను,చంద్రుడిని కాని, వృక్షాలను కాని పరికించి చూద్దామని కూర్చోలేదు. అనేకమైన సామాజిక కార్యక్రమాలతో, రాజకీయ కలాపాలతో తలమునకలుగా మునిగిపోయి వున్న మనకు తీరిక ఎక్కడ? ఈ కార్యకలాపాలన్నీ కూడా మన నుండి మనం తప్పించుకొని పోయే పలాయనాలు అని నిస్సందేహంగా చెప్పచ్చు. ప్రకృతి ఆరాధన కూడా మన నుండి మనం తప్పించుకొని పోయే పలాయన మార్గమే. ప్రకృతిని మనం ఎప్పడూ పలాయన సాధనం గానో, లేదా అంటే ఉపయోగకర వస్తువుల కోసం గానో వినియోగించుకుంటున్నాం. అంతే తప్ప కాస్త ఆగి, అన్నీ ఆపివేసి ఈ భూమిని, భూమి ఉత్పత్తి చేస్తున్న సంపదను ప్రేమగా చూడం. పంట పొలాల సౌభాగ్యాన్ని ఆనందంగా ఆస్వాదించం గానీ ఆ పంటలను మాత్రం మన ఆహారం కోసం, మనవస్త్రాల ఉత్పత్తి కోసమూ ఉపయోగించుకుంటాం. మన స్వహస్తాలతో నేలను దున్నడానికి ఇష్టపడం. అసలు ఒళ్ళు వొంచి కాయకష్టం చేయడం అంటేనే అవమానంగా భావిస్తాం.

*("వాట్ ఆర్ యు డుయింగ్ విత్ యువర్ లైఫ్" నుండి)*

(2వ పేజీ తరువాయి) . . .

## సంఘర్షణ

హింసాత్మకంగా ఉండి- సంఘర్షణ అంటే ఇదే-అహింసాత్మకంగా అవాలని ప్రయత్నించడం అనే మరికొంత సంఘర్షణను అదనంగా చేరుస్తుంటాను. సామాజిక నీతి అంతా ఇదే. మతాత్మకమైన విధివిధానాలు కూడా ఇంతే. అర్థమవుతున్నది కదా? ఏమంటారు?

**ప్ర:** అవును, నిజమే.

**కృ:** మనం ఎంత దాకా వచ్చావో చూడగలుగుతున్నారా? అవగాహన అయింది కాబట్టి సాంప్రదాయిక దృక్పథాన్ని పూర్తిగా మీరు త్యజించి వేస్తే కనుక ఇప్పుడు మీ మనసు యొక్క నిజమైన స్థితి ఏమిటి? ఎందుకంటే సంఘర్షణ కంటె మానసిక స్థితే చాలా ముఖ్యమైన అంశం.

**ప్ర:** అది నాకు తెలియదు.

**కృ:** మీకెందుకు తెలియదు? నిజంగానే కనుక మీరు సాంప్రదాయిక ధోరణిని త్యజించివేసి నట్లయితే, మీ మనసు ఉన్న స్థితిని గురించిన ఎరుక మీకెందుకు కలగదు? మీకు తెలియకుండా ఎలా ఉంటుంది? త్యజించి వేసి అయినా ఉండాలి, లేదా మీరు త్యజించ లేదు. అంతే. త్యజించినట్లయితే మీకు తెలుస్తుంది. త్యజించినప్పుడు అమాయకతతో, నిర్మలంగా సమస్య వైపు చూసే విధంగా మనసు తయారవుతుంది. సమస్యను అదే ప్రప్రథమంగా చూస్తున్నట్లుగా మీరు చూడగలుగుతారు. ఇది కనుక మీరు చేసినట్లయితే సంఘర్షణ అనే సమస్య అసలు ఉంటుందా? సమస్య వైపు పాత కన్నులతో చూస్తున్నారు కాబట్టే సమస్య ఇంకా బాగా బలంగా తయారవడమే కాకుండా బాగా నలిగిపోయి పాతబడిన దారి లోనే కదిలి పోతూ ఉంటుంది. అందుచేత అసలు ప్రధానమైనది ఏమిటంటే సమస్య వైపు ఏ రకంగా చూస్తున్నారు అనేది. పాత కన్నులతో సమస్యను చూస్తున్నారా, కొత్త కన్నులతోనా అనేది. కొత్త కన్నులు అంటే నిబద్ధితమైన ప్రతిస్పందనలతో సమస్యను చూడటం నుండి విడుదల పొందిన కన్నులు. సమస్యను ఫలానా అని గుర్తించి దాని కొక పేరును తగిలించడం కూడా సాంప్రదాయిక దృక్పథమే. సమర్థించడం, ఖండించడం, సంతోషకరమైనది, బాధాకరమైనది అని సమస్యను అనువదించుకోవడం వంటివి అన్నీకూడా సమస్యను గురించి ఏదైనా చేయాలి అనేటటువంటి అలవాటుగా వస్తున్న సాంప్రదాయిక వైఖరిలో భాగమే. సాధారణంగా దీనినే సమస్య ఎడల సకారాత్మక చర్య తీసుకోవడం అని అంటూ ఉంటారు. మనసు కనుక ఇదంతా నిష్ఫలమని, తెలివి హీనమని పూర్తిగా తుడిచి పెట్టి వేసేసినట్లయితే, అప్పుడు మనసు చాలా గొప్ప సున్నితత్వాన్ని, ఉన్నతమైన క్రమశీలతను పొంది స్వేచ్ఛగా ఉంటుంది.

**ప్రశ్నిస్తున్నవారు:** నా మీద మీరు చాలా పెద్ద భారం మోపుతున్నారు. ఇది నేను చేయలేను. ఇది చేయడం నా వల్ల కాదు. నేను మానవాతీతుడిని అవాలని అంటున్నారు.

**కృ:** మానవాతీతునిగా తయారవాలని అనుకుంటూ మీకు మీరే కష్టాలు తెచ్చి పెట్టుకుంటున్నారు. మీరే ఆటంకాలను తయారు చేసుకుంటున్నారు. అటువంటిదేమీ అవసరం లేదు. జోక్యం చేసుకోవాలి అని అంటున్న కన్నులతో మీరు విషయాలను చూస్తుంటారు. తాము చూస్తున్న అంశం గురించి ఏదో చేయాలి అని అనుకుంటున్న కనులతో చూస్తారు. ఆ అంశం గురించి ఏదో చేయడం అనేది ఆపివేయండి. ఎందుకంటే మీరు ఏం చేసినా అది సంప్రదాయంలో భాగమే. అంతే. సాదా సీదాగా-సరళంగా ఉండండి. గ్రహింపు లోని మహత్వం, అద్భుతం ఇదే. గతాన్ని పూర్తిగా తుడిచి పెట్టివేసినటువంటి మనోహృదయాలతో గ్రహించడం. లేకుండా చేయడమే అత్యంత సకారాత్మక చర్య.

*('అర్జెన్సీ ఆఫ్ ఛేంజ్' నుండి)*

## ప్రేమ మనసుకి సంబంధించినది కాదు

ప్రేమ విచిత్రమైనది. దాని వెచ్చని జ్వాలని ఎంత సులభంగా పోగొట్టుకుంటాం. జ్వాల పోతుంది. పొగ మిగులుతుంది. ఆ పొగ మన హృదయాల్లో మనసుల్లో నిండిపోయి ఉంటుంది. మన రోజులు కన్నీళ్ళతో కాఠిన్యంతో గడుస్తాయి. పాటని మరచి పోతాం. మాటలకి అర్థం పోతుంది. పరిమళం పోతుంది. మన చేతులు ఖాళీగా ఉంటాయి. పొగ లేకుండా జ్వాలని ఎలా నిలుపుకోవాలో మనకు తెలియదు. పొగ ఎప్పుడూ జ్వాలని ఆర్పేస్తుంది. ప్రేమ మనసుకి సంబంధించినది కాదు. ఆలోచన తయారు చేసిన వలలో ఉండదు. ప్రేమను వెతికి పట్టుకోవడం సాధ్యం కాదు. అలవరచుకోవడము, దాచుకోవడము సాధ్యం అవదు. మనసు మౌనంగా ఉన్నప్పుడు, మనసుకి సంబంధించిన విషయాలతో హృదయం ఆక్రమింప బడనప్పుడు ప్రేమ ఉంటుంది.

*(కమెంటరీస్ ఆన్ లివింగ్-2)*

## 'నాకు తెలియదు'

**'నాకు తెలియదు' అని మీరు అన్నప్పుడు మీరు నేర్చుకుంటున్నారనమాట. నేర్చుకోవడం అంటే విజ్ఞానాన్ని కాని, వస్తువులను కాని బాంధవ్యాలను కాని సేకరించి దాచుకోవడం కాదు. తెలివిగా ఉండటం అంటే సాదాగా, సరళంగా ఉండటం. అయితే సారళ్యతతో ఉండటం మహా కష్ట సాధ్యం.**

## మన కుటుంబాలపై మనకి నిజమైన ప్రేమ ఉన్నదా?

'నా కుటుంబం అంటే నాకు ప్రేమ' అని మీరు అంటారు కానీ నిజంగా మీరు కుటుంబాన్ని ప్రేమించడం లేదు. నిజంగా ఉన్నమాట చెప్పాలంటే మీలో ప్రేమ లేదు. మా పిల్లలను ప్రేమిస్తున్నాము అని మీరు అంటుంటే నిజంగా దాని అర్థమేమిటంటే వాళ్ళు ఒక అలవాటుగా అయారని, ఆడుకొనే బొమ్మలుగా అయారని. అంటే కొంతసేపు వినోదాన్ని ఇచ్చే వస్తువులుగా ఉంటారని. కానీ మీరు దేనినైనా సరే ప్రేమిస్తుంటే, పిల్లలను ప్రేమిస్తుంటే - అప్పుడు వారంటే శ్రద్ధ చూపుతారు.

శ్రద్ధ చూపడం, పట్టించుకోవడం అంటే ఏమిటో మీకు తెలుసా? శ్రద్ధ వుంటే కనుక, ఒక చెట్టును నాటినప్పుడు దాని ఆలనపాలన చూస్తారు. సంరక్షణ, పోషణచేస్తారు. మొక్కను నాటే ముందు లోతుగా త్రవ్వాలి. మట్టి నాణ్యం బాగుందా లేదా అని చూసుకోవాలి. అప్పుడు మొక్కను నాటాలి. ఆ పైన సంరక్షణ చేస్తూ వుండాలి. ప్రతి రోజూ గమనించి చూస్తూ కనిపెట్టుకొని వుండాలి. మీ సంపూర్ణ అస్తిత్వంలో ఆ మొక్కా ఒక భాగం అన్నట్లుగా ఆ మొక్కను జాగ్రత్తగా చూసుకోవాలి. అయితే మీరు మీ పిల్లలను ఈ మాదిరిగా ప్రేమిస్తున్నారా? అలా ప్రేమిస్తుంటే కనుక అప్పుడు ఒక పూర్తిగా విభిన్నమైన విద్యావిధానాన్ని ఏర్పరుస్తారు. అప్పుడు యుద్ధాలు వుండవు. పేదరికం వుండదు. అప్పుడు మనసుకు సాంకేతిక పరమైన శిక్షణను మాత్రమే ఇచ్చి పూరుకోరు. అప్పుడు పోటీ తత్వం వుండదు. జాతీయ వాదం వుండదు. పిల్లలంటే మనకు ప్రేమ లేదు గాబట్టే ఇవన్నీ పెరిగిపోతుంటే చూస్తూ పూరుకున్నాం.

*('వాట్ ఆర్ యు డుయింగ్ విత్ యువర్ లైఫ్' నుండి)*

# జ్ఞానసంచయం : తెలివి *(గత సంచిక తరువాయి)*

## బాహ్యాంభ్యంతర విషయాల గురించిన అప్రమత్తత

కొందరు తల్లిదండ్రులు 'మాకీ పూజా పునస్కారాల్లో విశ్వాసం లేదు' అనేస్తారు; ఆ ఇంటి బాలుడికి అదీ నమ్మతంగానే కనిపిస్తుంది. అసలు విషయమేమిటంటే, బాలుడి మెదడు అప్పటికో మట్టి ముద్ద; లప్పంలాగా వుంటుంది. ఆ సమయంలో ఆ మెదడు మీద ఈ గుర్తులు, రికార్డుమీద గీట్లు గీసినట్లు పడుతుంటై. ప్రతి ఒక్కటీ ఆ పసివాని మీద ముద్ర వేసుకుంటుంది. అది అతడికి తెలిసీ జరగచ్చు తెలియకుండానూ జరగవచ్చు.

కాలక్రమేణా హిందువుగానో, ముస్లిముగానో, కాథలిక్కుగానో, లేక ఏ విశ్వాసములేని వానిగానో రూపొందుతాడు. ఇక ఆ తర్వాత అనేక భేదభావాలు సృష్టించుకుంటాడు; నా నమ్మకం ఒకటైతే, నీ నమ్మకం మరొకటి, నీదేవుడు వేరు, నా దేవుడు వేరు, ఇది నా దేశం, అది నీ దేశం, ఇలా అనేక భేదాలు కల్పించుకుంటాడు. నిబద్ధీకరణ పలు రూపాలు ధరిస్తుంది; మీరెప్పుడూ ప్రయత్న పూర్వకమైన కృషి సల్పుతుండాలి అని మీ పెద్దల అభిప్రాయం. విద్యనార్జించడానికైనా, పరీక్షలు పాసవడానికైనా, ఆఖరికి మంచి మనిషిగా రూపొందడానికైనా, సతతం ఎడతెగని కృషి సల్పుతుండాలి అని మిమ్మల్ని నిబద్ధీకరించారు.

ఇలాంటి ప్రభావానికి లోనై, చిక్కుముడులు పడ్డ మీ మనసును ఎలా విడదీస్తారు? ఈ నిబద్ధీకరణనుండి ఎలా విడివడతారు? మీ తెలివిని వినియోగించి, పరిష్కారం కనుగొనండి. 'ఈ పనిచేయండి, ఈ నిబద్ధీకరణ వదలిపోతుంది' అని ఎవరో ఏదో చెప్పారు కాబట్టి, చేశాం అనకండి. మీనిబద్ధతను ఎలా తొలగించుకోవాలో మీరే కనుగొనండి.

ఇక ఇప్పుడు ఈ నిబద్ధీకరణను ఎలా పోగొట్టుకుంటారో, మీరునాకు చెప్పండి; క్షుణ్ణంగా నాతో చర్చించండి.

**వి:** మా నిబద్ధీకరణను ఎలాపోగొట్టు కోవాలో మీరే చెప్పరాదూ?

**కృ:** మీ అంతట మీరు ఆలోచించకుండా, నే చెప్పినట్లుచేస్తే, మళ్లీ ఈ కొత్తరకమైన నిబద్ధీకరణకు గురయినట్లేకదా? ముందసలు మీరు నిబద్ధీకరింపబడివున్న సంగతి మీకు స్వయంగా తెలుసా? ఎలా తెలుసు? మీరు నిబద్ధింపబడినట్లు ఎవరో మీకు చెప్పారు కాబట్టి, తెలుసనుకుంటున్నారా? లేక స్వయంగా మీకే తెలిసిందా? ఈ రెంటికీ తేడా తెలుస్తున్నదా? మీరు ఆకలిగొనివున్నారని ఎవరో వచ్చి మీతో అనడం వేరు. మీకు స్వయంగా ఆకలికలిగి, 'నాకు ఆకలిగా వుంది' అనడంవేరు. ఈ రెంటికీ తేడా కనిపిస్తున్నదా? అదే విధంగా, వేరెవరో వచ్చి చెప్పాల్సిన అవసరం లేకుండా మీ అంతట మీరే 'నేను హిందువుగా నిబద్ధింపబడ్డాను', 'నేను ముస్లిముగా నిబద్ధింపబడ్డాను' అనే విషయం, స్వయంగా మీకే తెలుస్తున్నదా?

ఇప్పుడు మిమ్మల్ని ఓ ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్పేముందు కొంత పస్తాయిస్తున్నారేమో చూడండి. సరేనా? పరిశీలించండి. ఆలోచించి ఆవేశపడకుండా, భావోద్వేగంతో నిమిత్తం లేకుండా ముందే ఏర్పరుచుకున్న అభిప్రాయాల జోక్యం లేకుండా, జాగ్రత్తగా ఆలోచించి సమాధానం చెప్పండి. ప్రశ్న ఏమిటయ్యా అంటే, మీకు మరొకరు చెప్పే అగత్యం లేకుండా, మీ అంతట మీరే స్వయంగా మీరు నిబద్ధీ కృతులని మీకు తెలుసా? అది మీకు ఎఱుకేనా?

అసలు ఎఱుక అంటే ఏమిటో మీకు తెలుసా? మీ వ్రేలేదైనా నొప్పిగా వున్నదని మీ అంతట మీకే తెలుస్తుంటుంది. మీ వ్రేలులో వున్న నొప్పిని గురించి మరొకరు వచ్చి తెలియజేయనక్కరలేదు. అచ్చం ఇదే విధంగా మీరు నిబద్ధీకృతులైనట్లు మీకు స్వయంగా తెలుసా? హిందువుగానో మరేదోగానో నిబద్ధింపబడివున్నారని, కొన్ని విషయాలనైతే నమ్ముతారని మరికొన్నిటిని నమ్మరనీ, ఆలయానికి వెళ్లవలసివుంటుందనో, లేకవెళ్లకూడదనో నిబద్ధీకృతులైవున్నారని మీకు తెలుస్తున్నదా? ఆ ఎరుక మీకు వున్నదా?

**వి:** ఉన్నది. నాకు తెలుసు.

**కృ:** నిజంగా తెలుసా? సరే, అంత ఖాయంగా తెలిసివుంటే ఇప్పుడేమిచేస్తారు?

**వి:** ఈ నిబద్ధీకరణను వదిలించుకోవాలని నాకు ఉందా లేదా అని చూస్తాను.

**కృ:** సరే, మీరు నిబద్ధీకృతులైవున్నారని మీరే తెలుసుకున్నారు అనుకుందాం. అప్పుడేమవుతుంది? నిబద్ధీకృతుడైతే తప్పేమిటి అని నేనడుగుతాను. నేను, నా మీద పడిన ప్రభావంచేత ముస్లిముగా నిబద్ధింపబడ్డానని అనుకుందాం. మీరేమో హిందువుగా నిబద్ధింపబడివున్నారు. సరేనా? అప్పుడేమవుతుంది? మనమిద్దరం ఒకేవాడలో నివసిస్తున్నప్పటికీ, నా విశ్వాసాలు నాసిద్ధాంతంతో నేనూ, నీ విశ్వాసం నీ సిద్ధాంతంతో మీరూ ఇద్దరమూ వీధిలో తటస్థపడినప్పుడు వేర్వేరు అయిపోవడంలేదా? వేరైనప్పుడు మనిద్దరి మధ్యా సంఘర్షణ తప్పదు కదా? రాజకీయ సాంఘిక, ఆర్థిక జాతిపరమైన విభేదాలు పాటించినంతకాలం సంఘర్షణ తప్పదు. అందువలన విభేదాలకు, వైరుధ్యాలకు మనమన నిబద్ధీకరణే కారణం. అందుచేత ఈ లోకంలో శాంతి సామరస్యాలతో బ్రతకాలంటే, నిబద్ధీకరణనుండి విడివడాలి. మిమ్మల్ని మీరు ముస్లింగానూ, హిందువుగానూ పరిగణించడం మానేయండి, తెలివి అంటే ఇదే, తన పైగాఢంగా పడిన ప్రభావాన్ని, స్వయంగా గుర్తించడం, లోకంలో ఈ నిబద్ధీకరణ మనుషుల్ని ఎలా ప్రవర్తింపచేట్లు చేస్తున్నదో గమనించడం, జాతి మత భాషా విభేదాలు మానవాళిని ఎలా

☞ 6

# మన మనసే మనల్ని మోసగిస్తుంది

**ఒకరి ప్రశ్న:** మన మనసే మనల్ని వంచించగలుగుతుందా?

**కృష్ణమూర్తి:** ఆ. నిస్సందేహంగా. మహాకుటిలత గల, వక్రమైన వాటిల్లో ఈ మనసు ఒకటి. ఈ మనసు ఏదైనా కల్పించగలదు. అక్కడ లేని వాటిని చూడగలుగుతుంది. బ్రహ్మాండమైన గారడీలూ చేయగలదు. అందుచేత ఈ మనసు మీద ఆధారపడితే అది పెను విపత్తులకు దారి తీస్తుంది. అయితే ఈ మనసు అనే సమస్త స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి మనం ఎలా ఆలోచిస్తున్నామో ఎందుకు ఆలోచిస్తున్నామో అర్థం చేసుకోవడానికి, మనం ఉపయోగించే మాటలు అర్థం చేసుకోవడానికి దైనందినిక జీవితంలో ఏ రకంగా ప్రవర్తిస్తుంటాము, ఇతరుల ఎడల ఏ రకంగా వ్యవహరిస్తుంటాము, ఏ రకంగా మాట్లాడుతుంటాము. ఏ రకంగా తింటాము, ఏ విధంగా నడుస్తాము-ఇటువంటి వాటన్నింటి ఎడల ఎరుకగా వుంటే కనుక అప్పుడు మనసు మనలను వంచించలేదు. అప్పుడు మోసగించడానికి ఏదీ, ఏ ఒక్కటీ వుండదు. అప్పుడు మనసు అధికారం చేసి, పెత్తనం చెలాయించేదిగా వుండదు. అణచి అదుపు చేసేదిగా వుండదు. అప్పుడు మనసు చాలా అసాధారణమైన నెమ్మదిని పొంది మృదువుగా, సున్నితంగా సజీవంగా అవుతుంది. అప్పుడు వంచన, మోసం అనేవి ఏమాత్రం ఉండవు.

(5వ పేజీ తరువాయి) . . .

## జ్ఞానసంచయం : తెలివి

చీలదీసినయ్యో చూడడం, ఈ విభేదాలు కొనసాగించినంతకాలం ఈ వర్గాల మధ్యపోరు తప్పదని గ్రహించడం, ఇదంతా తెలివే. ఇది చూడటం, నిబద్ధీకృతులమైనామని ఎరుక గలిగివుండటం తెలివి. ఇక ఇవాళ్టికి చాలు. ఇంకేమైనా ప్రశ్నలడగాలని వుందా?

**వి:** తగిన విచారణ చేయకుండా ఏర్పరుచుకున్న దురభిప్రాయంనుండి ఎలావిడివడాలంటారు?

**కృ:** ఎలా అని ప్రశ్నించినపుడు, ఆ పదాన్ని ఏ అర్థంలో వాడుతున్నారు? నేనిక్కడ కూచోనున్నాను. ఇక్కడ నుండి ఎలా లేవాలి అంటే? లేవడమే. ఎలా లేవాలి అని నేనెవరినీ అడగడం లేదే? మీ తెలివిని ఉపయోగించండి. లోతుగా పాతుకుపోయిన దురభిప్రాయాలతో వుండకండి. ముందు అసలు మీకు ఇలాంటి అపోహలు ఉన్నాయని ఇతర్లు చెప్పినందువల్ల ప్రయోజనం లేదు. వారి కేవో వేరే దురభిప్రాయాలుండవచ్చు. అందువల్ల మీ దురభిప్రాయాలగురించి వారేమంటున్నారనేది అనవసరం. మీ దురభిప్రయాలు ఏమి చేస్తున్నాయో చూడండి; ఇవి మనుష్యుల్ని వర్గాలుగా చీలదీస్తాయి. ఇలాంటి సందర్భంలో తెలివైన చర్య అవసరం పడిందని మీరే గ్రహిస్తారు. మనసు అపోహ దురభిప్రాయం నుండి వేగంగా విడివడాలని తెలుసుకుంటారు. 'ఎలా' అని అడుగుతున్నారంటే, ఏదో ఒక పద్ధతి, ఒక విధానం తెలియజేయమని అడుగుతున్నారన్నమాట. అసలు మనసు దురభిప్రాయం నుండి విడివడగలదా అనేది చూడండి. దురభిప్రాయంలో చిక్కుకోవడమంటే ఏమిటో, విముక్తి చెందడమంటే ఏమిటో తిన్నగా గమనించండి.

మీరసలు ఎందుకు దురభిప్రాయానికి గురి అవాల్సి వచ్చింది? నిబద్ధీకరణలో అదొక భాగం కాబట్టి. ఈ దురభిప్రాయాలు ఏర్పరుచుకోడంలో సుఖమూ, హాయీవున్నాయికాబట్టే వీటిని అట్టే పెట్టుకుంటున్నారు. అందువల్ల, ముందు దీనినంతా గమనించి ఎరుక తెచ్చుకోండి. నేల ఎంత అందమైనదో చూడండి; ఈ వృక్షాలు, వాటి ఛాయ, ఆ వెలుగు యొక్క వింతకాంతి, గాలికి ఊగే ఆ చెట్లూ, ఆ పక్షులూ అన్నిటినీ తిలకించండి. ఈ బాహ్య దృశ్యం చూచిన అనంతరం, నెమ్మదిగా మీలోనికి జరగండి; మీ గురించి ఎరుకగా అవండి. మీ మిత్రులతో మీ సంబంధాలు ఎలావుంటున్నాయో, మీ ఆలోచనలు ఎలాసాగుతున్నాయో గమనించండి. ఈ గమనిక తెలివిని మేల్కొల్పుతుంది. ఇవాళ్టికిది చాలనుకుంటాను. మరేదైనా చేద్దాం.

ముందు కదలకుండా కూచోండి సుఖంగా హాయిగా, ప్రశాంతంగా కూచోండి. ఎలా కూచోవాలో నేచూపిస్తాను చూడండి. ఇప్పుడిక ఆ చెట్లూ, ఆ కొండలూ వాటి రంగూ రూపూ అన్నిటినీ జాగ్రత్తగా పరికించండి. నా మాటల్ని వదిలేయండి. పసుపుపచ్చరంగు సంతరించు కుంటున్న ఆ చెట్లు ఆకుల్ని చూడండి. అటు ఆ చింత చెట్టూ, మీ మనసులో వాటిని గురించి మీకున్న పరిజ్ఞానంతో కాదు. కేవలం కళ్లతో చూడండి. ఆ రంగులన్నిటినీ చూచిన తర్వాత, ఈ నేల, ఈ పర్వతశ్రేణి, ఈ బండరాళ్లు, అవతలి ఆ నీడలూ, వీటన్నిటి స్వరూపం, ఈ వెలుపలి దృశ్యమంతా చూచిన అనంతరం, అంతర్ దృష్టి సారించండి. కళ్లు మూసేసుకోండి, సంపూర్తిగా మూసేయండి. బయటిలోకాన్ని చూడడం అయిపోయింది, ఇక అంతర్లోకంలో ఏమి జరుగుతున్నదో చూడండి; ఆలోచించకండి, ఉత్తినే గమనించండి; కనుపాపలు కదలనివ్వకండి. బాహ్యమైనదంతా చూసేశారు కదా. ఇక లోపలివైపు చూడాలంటే కళ్లు మూసుకునే చూడాలి. మనసులోని కదలికలు కనిపెట్టాలంటే లోలోన ఎంతో ప్రశాంతత ఉండాలి. ఇలా చేస్తే ఏమవుతుందను కుంటున్నారు? చాలా మృదువైన మనసు నెలకొంటుంది. బాహ్యాభ్యంతరాల విషయాల గురించి అప్రమత్తులవుతారు. అప్పుడు వెలుపలా లోపలా కూడా ఒకటే అని తెలుస్తుంది. చూచేవాడూ చూడబడేది ఒకటేనని కనుక్కుంటారు.

*(ఆన్ ఎడ్యుకేషన్ నుండి; 3వ అధ్యాయం)*

### అప్రమత్తంగా ఉన్నవారికి సహాయం ఎక్కడో అక్కడ లభిస్తుంది

ఒక డాక్టరు, చిన్న పిల్లల చిరునవ్వులు, దారిన పోతున్న మనిషి మందస్మిత వదనం, ఒక అనుబంధం, గాలికి ఎగిరి పోతున్న ఆకు, వాతావరణంలో మార్పు, అధ్యాపకుడు లేదూ ఒక గురువు ఎవరైనా సరే, ఏదైనా సరే సహాయం అందివ్వవచ్చును. అప్రమత్తంగా ఉన్నవారికి ఎక్కడో అక్కడ సహాయం లభిస్తుంది. కానీ మనలో చాలా మంది మన చుట్టూ ఏమున్నదో పట్టించుకోకుండా నిద్రపోతూ వుంటారు. ఒక్క మనం నమ్మిన గురువు గారినో గ్రంధాన్నో తప్ప మరేదీ పట్టించుకోము.

ఇదే మన అసలు సమస్య. నేను ఏదైనా చెప్తే శ్రద్ధగా వింటారు. అవునా కాదా? ఇదే విషయం మరెవరైనా కనుక బహుశ మరో రకమైన భాషలో భిన్నమైన మాటలు ఉపయోగించి కనుక చెప్తే మీరు చెవులు మూసుకుంటారు. ఎవరినైతే ప్రామాణికం అని మీరు అనుకుంటారో వారి మాటలు వింటారు. తక్కిన వారు మాట్లాడుతున్నప్పుడు ఈ అప్రమత్తత ఉండదు.

**మీ చిరునామా మాకు వ్రాయండి.**
**'అంతరంగ యాత్ర'ను**
**ఉచితంగా పంపుతాము.**

*Published in August, December & April* Periodical
*Registered with The Registrar of Newspapers for India under No. TNTEL/2006/19442*

*If undeliverd please return to:*
KRISHNAMURTI FOUNDATION INDIA
Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65) Greenways Road
Chennai - 600 028. Tel: 24937803/24937596
E-mail: publications@kfionline.org
Websites: www.kfionline.org/www.jkrishnamurti.org

*Published by G. Rajeev on behalf of the Krishnamurti Foundation India, Vasanta Vihar, 124, 126 (Old No. 64, 65)Greenways Road, Chennai - 600 028.*
*Printed by N. Subramanian at Sudarsan Graphics Offset Press, 27 Neelakanta Mehta Street, T. Nagar, Chennai - 600 017. Editor : K. Krishnamurthy*